సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 15 । జూన్ । 2023



అభివృద్ధి పథంలో..
తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం నిర్వహించేందుకు గ్రామ పంచాయతీలను మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు.
4లో



..సేవలు హర్షణీయం
వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది కోవిడ్ సమయంలో అందించిన సేవలు హర్షణీయమని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు.
4లో

గరిష్టం / కనిష్టం
42° / 29°

వాతావరణం
జిల్లాలో గురువారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. ఉదయం నుంచే ఎండ తీవ్రత ఉంటుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య కల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: శ్రీసీతారామ చంద్రస్వామివారి కల్యాణం బుధవారం కమనీయంగా జరిగింది. తొలుత తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం నిర్వహించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. బుధవారం సందర్భంగా స్వామివారికి స్నపన తిరుమంజనం గావించారు.

ఎన్నికల ప్రణాళికను సిద్ధం చేయాలి
కలెక్టర్ అనుదీప్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఎన్నికల నిర్వహణ కోసం ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ అధికారులకు సూచించారు. ఎన్నికల నిర్వహణపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో హైదరాబాద్ నుంచి బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, డీజీపీ అంజనీకుమార్ యాదవ్‌తో కలిసి ఓటరు జాబితా, పోలింగ్ బూతులలో మౌలిక వసతుల కల్పన, ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ అనుదీప్, ఎస్పీ డాక్టర్ వినీత్ హాజరయ్యారు. అనంతరం జిల్లా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి వివరాలతో అన్ని శాఖలు ప్రణాళిక నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎన్నికల తహసీల్దార్ సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నిలుపుదల

కొత్తగూడెంఅర్బన్: పెండింగ్ వేతనాలు, ఇతర బిల్లులు చెల్లించాలని కోరుతూ మిడ్డేమీల్స్ వర్కర్స్ మధ్యాహ్న భోజన పథకాన్ని జిల్లాలోని పలు మండలాల్లో బుధవారం నిలుపుదల చేశారు. గురువారం నుంచి అన్ని మండలాల్లో నిలిపివేస్తామని మిడ్డేమీల్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి తెలిపారు. కొత్తగూడెం, పాల్వంచ, చంద్రుగొండ మండలాలతోపాటు మరికొన్ని మండలాల్లో మధ్యాహ్న భోజన పథకం నిలుపుదల చేశామని, తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు విధులకు వెళ్లబోమని తెలిపారు. కొన్ని బిల్లులు జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వచ్చినా కూడా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని వివరించారు. బ్యాంకు ఖాతాలలో డబ్బులు జమ కాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కాగా ముందస్తు సమాచారంతో విద్యార్థులు పాఠశాలలకు బాక్సులు తెచ్చుకోవడంతో ఇబ్బందులు తప్పాయి.

చంద్రుగొండ పీహెచ్‌సీకి ఉత్తమ పురస్కారం



కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ తనూజ

చంద్రుగొండ : చంద్రుగొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి ఉత్తమ సేవా పురస్కారం లభించింది. నేషనల్ క్వాలిటీ అస్యురెన్స్ స్టాండర్డ్స్ (ఎన్‌క్యూఏఎస్) అవార్డును బుధవారం అశ్వారావుపేటలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు చేతులమీదుగా డాక్టర్ కనకం తనూజ అందుకున్నారు. బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా డాక్టర్ కనకం తనుజ, బెస్ట్ ఆయుష్ డాక్టర్‌గా ప్రవీణ్‌కుమార్, బెస్ట్ ఫార్మసిస్ట్‌గా ఎం.లక్ష్మి, బెస్ట్ ఆశావర్కర్‌గా కె.రాజేశ్వరి అవార్డులు పొందారు.

బైపాస్‌కు క్లియరెన్స్..

- ఐదేళ్ల కిందట మొదలైన రోడ్డు నిర్మాణం
- ఇప్పటికే తొంభై శాతం పనులు పూర్తి
- గోధుమవాగు సమీపంలో నిలిచిన రహదారి
- తాజాగా భూ సేకరణకు నోటిఫికేషన్.. తొలగిన ప్రధాన అడ్డంకి



పాత కొత్తగూడెం శివారులో నిలిచిపోయిన ప్రత్యామ్నాయ రోడ్డు నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: కొత్తగూడెం బైపాస్ రోడ్డు నిర్మాణంలో ఎట్టకేలకు కదలిక వచ్చింది. బైపాస్ రోడ్డులో మిగిలిపోయిన పనులకు సంబంధించి భూసేకరణకు నోటిఫికేషన్ జారీ కాగా, రెవెన్యూ యంత్రాంగం సర్వే చేపడుతోంది.

చుంచుపల్లి–గోధుమవాగు–పాత కొత్తగూడెం – చాతకొండ మీదుగా

జిల్లా మీదుగా రెండు జాతీయ రహదారులు ఉన్నాయి. దశాబాల కిందటే విజయవాడ – కొత్తగూడెం –జగదల్‌పూర్ జాతీయ రహదారి 201 ఉండగా ఇటీవల హైదరాబాద్ ఓఆర్ఆర్ (వలిగొండ) – మహబూబాబాద్ – ఇల్లెందు – కొత్తగూడెం వరకు మరో జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 930పీ) మంజూరైంది. ఈ జాతీయ రహదారులు రెండు సైతం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం మీదుగానే వెళ్తున్నాయి. దీంతో జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటోంది. దీంతో ఐదేళ్ల కిందట ట్రాఫిక్ పట్టణంలోకి రాకుండా ఉండేందుకు ఖమ్మం రోడ్డులో చుంచుపల్లి – సీఎంపీఎఫ్ ఆఫీస్ – గోధుమవాగు – పాత కొత్తగూడెం – చాతకొండల మీదుగా నవభారత్ వరకు ప్రత్యామ్నయ మార్గం అభివృద్ధికి ప్రణాళిక రూపొందించారు.



ఏడాదికిపైగా ఆగిన పనులు

బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు రెండెంచెల్లో మొదలయ్యాయి. మొదటి బిట్‌లో చుంచుపల్లి నుంచి సీఎంపీఎఫ్ ఆఫీస్ వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. రెండో బిట్‌లో నవభారత్ నుంచి చాతకొండ శివారు పాతకొత్తగూడెం మీదుగా గోధుమ వంతెన వరకు రహదారి నిర్మించాల్సి ఉంది. ఇందులో గోధుమవాగు వరకు రోడ్డు నిర్మాణ పూర్తయి ఏడాది దాటింది. గోధుమవాగు నుంచి వంతెన వరకు కేవలం కిలోమీటరు మేరకు రోడ్డు నిర్మిస్తే ఖమ్మం – విజయవాడ నుంచి వచ్చే వాహనాలు కొత్తగూడెం టౌన్‌లోకి రాకుండా నేరుగా నవభారత్ వరకు వెళ్లిపోయేందుకు ఆస్కారం ఉంది. ఇదే సమయంలో పట్టణానికి మరో కొత్త రోడ్డు అందుబాటులోకి వచ్చి.. ఆ మేరకు అక్కడ అభివృద్ధికి ఆస్కారం ఉండేది. అయితే కిలోమీటరు రోడ్డుకు సంబంధించిన భూసేకరణ జరకపోవడంతో పనులు అటకెక్కాయి.

భూసేకరణ షురూ

బైపాస్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన 14 గుంటల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ఈ నెల మొదటి వారంలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో సర్వే నంబరు, రైతు పేరు, భూమి విస్తీర్ణం తదితర వివరాలను పేర్కొంది. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలుపుకునేందుకు నిర్ణీత గడువు ఇస్తున్నట్టు పేర్కొంది. గడువు ముగిసిన తర్వాత పరిహారం చెల్లించి భూమి సేకరించనున్నారు. అనంతరం నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశం ఉంది. బైపాస్ రోడ్డు నిర్మాణ పూర్తి కాకపోవడంతో ప్రస్తుతం విజయవాడ, ఖమ్మం మీదుగా భద్రాచలం వెళ్లే వాహనాలను పోస్టాఫీస్ సెంటర్ నుంచి కారుకొండ మీదుగా బొమ్మనపల్లి దగ్గర ఇల్లెందు రోడ్డుకు మళ్లిస్తూ ప్రధానమైన ఎంజీ రోడ్డుపై భారం తగ్గిస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో సమస్యకు పరిష్కారం దొరకడం లేదు.

తీరనున్న సమస్య

జిల్లాలో అనేక పరిశ్రమలు విస్తరించి ఉండటం, రెండు జాతీయ రహదారులు వెళ్తుండటంతో ఆయా పరిశ్రమలకు అవసరమైన సరుకుల రవాణా కోసం నిత్యం వందలాది లారీలు, భారీ వాహనాలు జిల్లా కేంద్రం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటికి తోడు గోదావరి తీరం వెంబడి అనేక ఇసుక రీచ్‌లు ఉన్నాయి. నిత్యం వందలాది లారీల్లో ఇసుకను రాష్ట్ర రాజధానికి రవాణా చేస్తున్నారు. ఇలా జిల్లాలోని అన్ని ప్రధాన మార్గాలు సరుకు రవాణాతో కిక్కిరిపోయి ఉంటున్నాయి. బైపాస్ అందుబాటులోకి వస్తే కొత్తగూడేనికి ట్రాఫిక్ కష్టాలు తప్పుతాయి.

తరుముకొచ్చిన మృత్యువు

- బూర్గంపాడు వద్ద ట్రాలీ ఆటో బోల్తా
- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
- మృతుల్లో తండ్రి, ఇద్దరు కుమారులు



కిన్నెరసాని నదిలో పడ్డ ఆటో ట్రాలీ

బూర్గంపాడు: భద్రాద్రి రామయ్యను దర్శించుకుని మొక్కులు తీర్చుకుని ఆనందంగా తిరుగుపయనమైన మూడు కుటుంబాలలో రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదం నింపింది. అప్పటివరకు భక్తిభావంలో మునిగిన ఆ కుటుంబాలను దేవుడు కూడా కనికరించలేదు. ట్రాలీ ఆటో రూపంలో తరుముకొచ్చిన మృత్యువు తండ్రిని ఇద్దరు కొడుకులను పొట్టనబెట్టుకుంది. వీరితోపాటు తోడల్లుడిని కూడా తీసుకుపోయింది. ఈ విషాదకర ఘటన బూర్గంపాడుకు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద బుధవారం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా టి.నర్సాపురం మండలం తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన జట్ల దుర్గారావు, అతని భార్య నిర్మల, వారి ఇద్దరు పిల్లలు సందీప్, ప్రదీప్, దుర్గారావు తోడల్లుడు పచ్చిపాల శ్రీనివాసరావు, అతని భార్య కమల, కుమార్తె రవిత్రేణి, శ్రీరామ్, దుర్గారావు బావమరిది దాసరి నర్సింహారావు అతని భార్య అనూష, వారి పిల్లలు రక్షిత, మేఘన.. మొత్తం పన్నెండుమంది బుధవారం తెల్లవారుజామున భద్రాచలం రామయ్య దర్శనానికి వచ్చారు. దాసరి నర్సింహారావుకు చెందిన ట్రాలీ ఆటోలో వీరంతా భద్రాచలం వచ్చారు. దర్శనం అనంతరం భోజనాలు చేసి తిరుగుపయనమయ్యారు. బూర్గంపాడు ప్రధానకూడలిలో కొద్దిసేపు ఆగి కూల్‌డ్రింక్స్ తాగారు. అక్కడ్నుంచి బయలుదేరిన ఐదు నిమిషాలలోనే తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బూర్గంపాడు–వేలేరు(ఏపీ) మార్గంలో బూర్గంపాడు సమీపంలోని కిన్నెరసాని బ్రిడ్జి వద్ద ట్రాలీ ఆటో అదుపు తప్పి 70 అడుగుల లోతులోని కిన్నెరసాని నదిలో పడిపోయింది. ఈ ఘటనలో జట్ల దుర్గారావు(36), అతని తోడల్లుడు పచ్చిపాల శ్రీనివాసరావు(40) అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్ర గాయాలతో ఆర్తనాదాలు చేస్తున్న మిగతావారిని స్థానికులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో దుర్గారావు ఇద్దరు కుమారులు జట్ల సందీప్(12), జట్ల ప్రదీప్(10) చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతుడు శ్రీనివాసరావు కుమార్తె రవిత్రేణి, నర్సింహారావు కుమార్తె రక్షిత పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో వారిని విజయవాడకు తరలించారు. ఈ ఘటనలో నర్సింహారావు, నిర్మల, అనూష, కమల, శ్రీరామ్‌లకు కూడా గాయాలయ్యాయి. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తులు మృతిచెందటంతో బంధువులు, ఇతర కుటుంబీకులు బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. మృతుల బంధువుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా శోకసంద్రంగా మారింది. మంగళవారం రాత్రి తిరుమలదేవిపేట నుంచి బయలుదేరి భద్రాచలం చేరుకున్న వీరు బుధవారం తెల్లవారుజామున దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం భోజనాలు చేసి కొద్దిసేపు షాపింగ్ చేసుకుని ట్రాలీ ఆటోలో బయలుదేరారు. రాత్రంతా నిద్రలేని కారణంగా భోజనం చేసిన తర్వాత డ్రైవర్ నర్సింహారావు డ్రైవింగ్ చేస్తున్న క్రమంలో కునికిపాటు వచ్చి ఉండటంతోనే ఆటో అదుపు తప్పి ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఆ సమయంలో అటుగా ఎటువంటి వాహనాలు కూడా ఎదురురాలేదని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో రోడ్డు కూడా గోతులు లేకుండా బాగానే ఉంది. నిద్రమత్తు కారణంగానే ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలిసిన వెంటనే ఎస్సై సంతోష్ ఘటనా ప్రాంతానికి చేరుకుని క్షతగాత్రులను స్థానికులతో కలసి భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. తహసీల్దార్ భగవాన్‌రెడ్డి ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులకు వైద్యసేవలు అందించేందుకు సహకరించారు. బూర్గంపాడు ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగు మృతదేహాలకు శవపంచనామా నిర్వహించి బంధువులకు అప్పగించారు.

డ్రైవర్‌కు నిద్ర లేకపోవడమే కారణమా?

భద్రాచలంఅర్బన్: తిరుమల దేవిపేటకు చెందిన 12 మంది ట్రాలీ ఆటోలో మంగళవారం బయలుదేరగా, అర్ధరాత్రి దాటాక 2 గంటలకు భద్రాచలం చేరుకున్నారు. నిద్రపోయేందుకు గదులను అద్దెకు తీసుకోకుండా, వచ్చిన ట్రాలీ ఆటోలోనే నిద్రించారు. బుధవారం తెల్లవారుజామునే సీతారామ చంద్ర స్వామివారి దర్శనం పూర్తి చేసుకున్నారు. అనంతరం పట్టణంలో భోజనం చేసి తిరుగుపయనమయ్యారు. ఈ క్రమంలో బూర్గంపాడు సమీపంలో ఆంధ్రప్రదేశ్ సరిహద్దు వద్ద ప్రమాదం జరిగింది. ట్రాలీ ఆటో నడుపుతున్న నరసింహారావు నిద్రలోకి జారుకోవడంతో ఒక్కసారిగా వాహనం అదుపుతప్పి రోడ్డుకు పక్కనే కిన్నెరసాని నదిలో పడిపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ప్రదీప్, సందీప్, రక్షిత, రవిత్రేణిని భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో సందీప్, ప్రదీప్ చికిత్స పొందుతూ మృతి చెందారు. మిగిలినవారిని పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు.



సందీప్, ప్రదీప్



దుర్గారావు, శ్రీనివాసరావు మృతదేహాలు

మా ప్రాణం అడ్డేసి కాపాడాం

డీఎంహెచ్‌ఓ శిరీష



సిబ్బందిని సన్మానిస్తున్న డీఎంహెచ్‌ఓ శిరీష తదితరులు

భద్రాచలంఅర్బన్ : కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలను రక్షించామని డీఎంహెచ్ఓ డాక్టర్ జేవీఎల్ శిరీష అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని కేకే ఫంక్షన్ హాల్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత అధికారులు జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం వైద్య ఆరోగ్య శాఖ పథకాలపై సిబ్బంది పాటలతో, నృత్యాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ వైద్య సేవలందించడంలో రాష్ట్రంలో భద్రాద్రి జిల్లా ఐదో స్థానంలో ఉందని, ప్రతి ఒక్కరూ తమ శక్తికి మించి పనిచేస్తున్నారని, ఇంకా కష్టపడాల్సిన అవసరం లేదని అన్నారు. కరోనాతో భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ నరేష్ మరణించారని గుర్తుచేసుకుంటూ కంటతడి పెట్టారు. గతంలో సాధారణ ప్రసవాల సంఖ్య ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా ఉండేదని, కేసీఆర్ కిట్ ప్రవేశ పెట్టడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య 80 శాతం పెరిగిందని చెప్పారు. ప్రభుత్వం వైద్యారోగ్య శాఖ ద్వారా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించేందుకు కేసీఆర్ న్యూట్రీషియన్ కిట్లను అందిస్తున్నారని తెలిపారు. గతంలో చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో డయేరియా, మలేరియాతో కుటుంబానికి ఒకరు మంచం పట్టే వారని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని అన్నారు. అనంతరం ఆశ కార్యకర్తలకు చీరలను పంపిణీ చేసి, వైద్యులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీఓ రత్న కళ్యాణి, స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, జిల్లా కోఆపరేటివ్ అధికారి వెంకటేశ్వరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రాజశేఖర్ రెడ్డి, వైద్యులు కిషన్, సుమన్, సవ్యశ్రీ, విజయరావు సిబ్బంది పాల్గొన్నారు.

వెనుదిరిగిన ఎమ్మెల్యే..

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చిన భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య(కాంగ్రెస్) కారు దిగే సమయంలో అక్కడున్న బీఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ వాహనం చూసి.. అసహనంతో వెళ్లిపోయారు. ఈ విషయమై ఆయన అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది.

మాకు న్యాయం చేయండి

- మేము భూములు ఇచ్చి త్యాగం చేస్తున్నాం..
- ఎకరానికి రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలి
- సీతమ్మ సాగర్ ప్రజాభిప్రాయ సేకరణలో నిర్వాసితుల ఆవేదన



ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరైన రైతులు, ప్రజలు

అశ్వాపురం: 'మేము సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌కు వ్యతిరేకం కాదు. ప్రాజెక్ట్ వల్ల రైతులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి. లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలమందికి తాగునీరు అందించేందుకు మేము మా భూములను త్యాగం చేస్తున్నాం. మా త్యాగాన్ని గుర్తించి మానవత్వంతో మాకు న్యాయం చేయాలి.' అని అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల నిర్వాసితులు విన్నవించారు. మండల కేంద్రంలోని ఎస్‌కేటీ కల్యాణ మండపంలో బుధవారం సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టుపై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసిత రైతులు, ప్రజలు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. ఎకరానికి పరిహారం రూ.8 లక్షలు ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. ఐదెకరాలు కోల్పోయిన రైతు ఆ డబ్బుతో ఎక్కడైనా భూమి కొందామంటే ఎకరం కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎకరానికి రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతంలో నీటి సదుపాయం లేని భూములకు సాగునీరు అందించాలని, త్రీ ఫేస్ కరెంటు సదుపాయం, మోటార్ల ద్వారా పొలాలకు సాగునీరు అందించేలా చూడాలని, గ్రామాలు ముంపునకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని నిర్వాసిత రైతులు అధికారులను కోరారు.

ఐదు సార్లు భూములు కోల్పోయాం..

మండల పరిధిలోని అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం గ్రామాల రైతులు మాట్లాడుతూ తాము గతంలో భారజల కర్మాగారం, రాజీవ్‌సాగర్, సీతారామ ప్రాజెక్ట్, మిషన్‌భగీరథ ఇప్పుడు సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌లో ఐదు సార్లు భూమి కోల్పోయమని పేర్కొన్నారు. ఐదు, పది ఎకరాలు ఉన్న రైతులు ఇప్పుడు సెంటు భూమి లేకుండా కూలీలుగా మారారని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని 200 రోజులు దీక్షలు చేసినా ఎవరూ పట్టించుకోలేదని, కోర్టుకు కూడా వెళ్లామని తెలిపారు. సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద నిర్మిస్తున్న జలవిద్యుత్ కేంద్రంలో రెండు గ్రామాలకు చెందిన 60 నిర్వాసిత కుటుంబాల్లో.. కుటుంబానికొకరు చొప్పున ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రాజెక్ట్‌కు కేంద్రం పర్యావరణ అనుమతులు మంజూరు చేయాలని రైతులు, ప్రజలు కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమంలో రైతులు, ప్రజలు తెలిపిన అభిప్రాయాలను పర్యావరణ శాఖకు నివేదిస్తామని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. కాగా సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐలు జితేందర్, సురేష్‌ల ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పొల్యూషన్ బోర్డు ఈఈ రవీందర్, జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి, డీఈలు రాంబాబు, శ్రీనివాస్, మణుగూరు డీఎస్పీ రాఘవేందర్‌రావు, సీఐ శ్రీనివాసరావు, తహసీల్దార్ ఎంఏ.రాజు, జెడ్పీటీసీలు సూదిరెడ్డి సులక్షణ, పోశం నరసింహారావు, వైస్ ఎంపీపీ వీరభద్రం, అశ్వాపురం, మణుగూరు, చర్ల, దుమ్ముగూడెం మండలాల ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.



హాజరైన అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, పొల్యూషన్ బోర్డు ఈఈ రవీందర్

సీతమ్మ సాగర్‌తో ఎన్నో ప్రయోజనాలు

–ప్రభుత్వ విప్ రేగా కాంతారావు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సీతమ్మ సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్తయితే ఉమ్మడి జిల్లా సస్యశ్యామలం అవుతుందని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. సీతారామ ప్రాజెక్ట్, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌ల ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాకు కూడా సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఈ బ్యారేజీ నిర్మాణం ద్వారా నీరు నిల్వ ఉండి ఎన్నో కిలోమీటర్ల మేర భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు.

అనుమతులు, నిబంధనల మేరకే పనులు

–శ్రీనివాసరెడ్డి, జలవనరుల శాఖ సీఈ



అనుమతులు లేకుండా పనులు చేపడుతున్నారని కొందరు మాట్లాడం బాధాకరమని అనుమతులు, నిబంధనల మేరకే సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌లు చేపడుతున్నామని జలనవరుల శాఖ సీఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. సీతారామ ఎత్తిపోతల పథకానికి ఫారెస్ట్, స్టేజీ–1, స్టేజీ–2, వెల్డ్‌లైఫ్, 16 డైరెక్టరేట్‌ల అనుమతులు వచ్చాయన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి 50 గ్రామాలకు నోటీసులు పంపామన్నారు. ప్రజాభిప్రాయసేకరణలో నిర్వాసితులు, ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు తెలిపిన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రాజెక్ట్ వల్ల రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిర్వాసిత రైతుల ఆగ్రహం

ప్రజాభిప్రాయసేకరణలో రైతుల అభిప్రాయాలతో పని లేదా?, తమకు మాట్లాడే అవకాశం ఇవ్వరా? అని పలువురు నిర్వాసిత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా సమస్యలు చెప్పుకునేందుకు పేర్లు నమోదు చేసుకోవాలా ? అని ప్రశ్నించారు. నిర్వాసిత రైతుల పక్షాన కాంగ్రెస్, సీపీఐ నాయకులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయగా, ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష పార్టీలు అడ్డుకునేలా చేస్తున్నాయంటూ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు నినాదాలు చేశారు. దీంతో పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు.

క్లుప్తంగా

ఉత్తమ వైద్యుడిగా మనీశ్‌రెడ్డి



ప్రశంసాపత్రం అందిస్తున్న విప్ రేగా కాంతారావు

గుండాల: పినపాక నియోజకవర్గ స్థాయిలో గుండాల వైద్యాధికారి మనీశ్‌రెడ్డికి ఉత్తమ అవార్డు దక్కింది. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్నేహ గార్డెన్స్‌లో జరిగిన వైద్య ఆరోగ్య శాఖ ఉత్సవాల కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే రేగా కాంతారావు చేతుల మీదుగా మనీశ్‌రెడ్డి ప్రశంసాపత్రం, అవార్డు అందుకున్నారు.

నీట్ ఫలితాల్లో గిరిజన విద్యార్థి ప్రతిభ



అరవింద్‌నాయక్

టేకులపల్లి: నీట్ ఫలితాల్లో టేకులపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి కుమారుడు ప్రతిభ కనబరిచాడు. వివరాలిలా ఉన్నాయి.. నీట్ ఫలితాల్లో కోయగూడెం ఓపెన్‌కాస్టు ఉద్యోగి భూక్య నాగేశ్వరరావు కుమారుడు అరవింద్‌నాయక్ జనరల్ కేటగిరిలో 22,384వ ర్యాంక్, ఆలిండియా ఎస్టీ కేటగిరిలో 100వ ర్యాంకు సాధించాడు. విద్యార్థిని సింగరేణి ఉద్యోగులు అభినందించారు.

12 మంది బైండోవర్



బైండోవర్ అయిన నాటుసారా విక్రేతలు

దుమ్ముగూడెం: గతంలో నాటుసారా విక్రయిస్తూ దొరికిన 12 మందిని తహసీల్దార్ మణిధర్ ఎదుట ఎక్సైజ్ అధికారులు బుధవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ రహీమున్నీసాబేగం ఆదేశాల మేరకు ఎస్‌ఐ మురళి నర్సాపురం, లక్ష్మీనగరం, సుజ్ఞానపురం, రేగుబల్లి, తాటివారిగూడెం గ్రామాలకు చెందిన 12 మందిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట హాజరుపరిచి బైండోవర్ చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ అలీం, కానిస్టేబుళ్లు బాబు, వీరబాబు, లలిత, చారి, సిబ్బంది వెంకట్ పాల్గొన్నారు.

కుంటలో నీళ్లు తాగి మేకలు మృతి

సుజాతనగర్: కుంటలో నీళ్లు తాగి ఏడు మేకలు మృతి చెందిన ఘటన డేగలమడుగు గ్రామ పరిధిలోని పంటపొలాల్లో బుధవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గోసుల ప్రసాద్ మేకలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే మేకలను మేతకు తోలుకెళ్లాడు. పొలాలకు సమీపంలోని ఓ కుంటలో నీళ్లు తాగేందుకు సుమారు 15 మేకలు నీటిలోకి దిగాయి. నీళ్లు తాగిన కొద్దిసేపటికే ఏడు మేకలు మృతి చెందగా మరో రెండు మేకలు అదృశ్యమయ్యాయి. మేకలు ఇటువైపు వస్తే ఎలాగైనా చంపేస్తానని గతంలో కుంట యజమాని బెదిరించాడని, అతడిపైనే అనుమానం ఉందంటూ బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అదుపుతప్పి లారీ బోల్తా

చర్ల: మండలంలోని సుబ్బంపేట సమీపంలోని ఎదిరగుట్టల మలుపు వద్ద ఇసుక లోడుతో వరంగల్‌కు వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. మండలం నుంచి ఇసుకను లోడు చేసుకొని వెళ్తున్న టీఎస్ 07 యూజీ 5549 నంబర్ గల లారీ సుబ్బంపేట సమీపంలోని ఎదిరగుట్టల్లోని సమ్మక్క సారలమ్మ గద్దెలు దాటిన తరువాత ఉన్న మూలమలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపైనే బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లకు స్వల్ప గాయాలయ్యాయి.


డీపీఆర్‌ఓకు మాతృవియోగం



నివాళులర్పిస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా పౌరసంబంధాల అధికారి శీలం శ్రీనివాస్ తల్లి సరస్వతి (72) అనారోగ్యంతో బుధవారం మరణించారు. సమాచారం తెలిసిన వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయులు, వివిధ కుల సంఘాల నాయకులు, ఉద్యోగులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, అధికారులు డేవిడ్‌రాజ్, నర్సింగరావు తోపాటు రామారావు, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వరరావు, వెంకటరమణ, రాజేశ్, ప్రతాప్, ఫణి, రాము, వాలియా నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,346

అభివృద్ధి పథంలో పల్లె..

- స్వరాష్ట్రంలో మారిన గ్రామాల రూపురేఖలు
- పల్లె ప్రగతితో మెరుగైన ఫలితాల సాధన
- నేడు తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవం



మామిడి తోరణాలతో ముస్తాబు చేసిన 3 ఇంక్లెయిన్ పంచాయతీ కార్యాలయం

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లెప్రగతి కార్యక్రమం గ్రామాల రూపురేఖలను పూర్తిగా మార్చి వేసింది. కొత్తగా ఏర్పడిన పంచాయతీలు సైతం అభివృద్ధి బాటపట్టాయి. హరితహారం, ట్రాక్టర్లతో ఇంటింటికీ చెత్త సేకరణ, అంతర్గత రహదారుల మెరుగు, ఏజెన్సీ పల్లెలకు వైద్య సేవల విస్తరణ, ఉపాధి పథకం అమలు తదితర కార్యక్రమాలతో పల్లె అన్ని రంగాల్లో ముందుకెళ్తోంది. ఉత్తమంగా నిలుస్తూ జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో అవార్డులు కూడా పొందుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం 481 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2019, సెప్టెంబరులో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తొలిసారి పల్లె ప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో యేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. ప్రతి గ్రామంలో శ్మశానవాటిక, డంపింగ్ యార్డు, పల్లె ప్రకృతి వనాలు, హరిత నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, గ్రంథాలయాలు వంటివి సమకూరాయి. తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగు కాలువల శుభ్రత, శిథిలావస్థలోకి చేరిన భవనాలు, పనికిరాని బావుల పూడ్చివేత, మొక్కల పెంపకం, కొత్తగా నర్సరీల నిర్వహణ, తడిపొడి చెత్త నిర్వహణ, అస్తవ్యస్తంగా మారిన విద్యుత్ సమస్యలు వంటి అంశాల్లో మెరుగైన ప్రగతికి సాధించాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో పాలకవర్గాలు సైతం అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఆర్థిక సంఘం నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి భరోసాగా నిలుస్తున్నాయి. పల్లెప్రగతి కార్యక్రమంలో 2021లో రాష్ట్ర స్థాయిలో జిల్లా ప్రత్యేక స్థానం దక్కింది. పచ్చదనం-పారిశుద్ధ్యం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, పన్నుల వసూళ్లు, డంపింగ్‌యార్డుల నిర్వహణలో మొత్తం ఆరు అంశాల్లో జిల్లా ఉత్తమంగా నిలిచింది. 2021–22 సంవత్సరానికి 46 జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీ అవార్డుల్లో జిల్లాకు చెందిన గౌతంపూర్ పంచాయతీకి ఆరోగ్య పంచాయతీ అవార్డు దక్కించుకున్న విషయం తెలిసిందే. గురువారం తెలంగాణ పల్లెప్రగతి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలను మామిడి తోరణాలతో ముస్తాబు చేస్తున్నారు.

నేడు నిర్వహించే కార్యక్రమాలు

- రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నేడు తెలంగాణ పల్లె ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి గ్రామ పంచాయతీలో ర్యాలీలు చేపట్టాలి. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు సర్పంచ్ జాతీయ జెండా ఎగురవేయాలి.
- గ్రామసభ నిర్వహించి పల్లె ప్రగతి ద్వారా, ఆ గ్రామానికి వచ్చిన నిధుల వివరాలను, వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామ ప్రజలకు జరిగిన లబ్ధిని, గ్రామంలో పల్లెప్రగతిలో నిర్మించిన మౌలిక వసతుల వివరాలను ప్రకటించాలి.
- గ్రామంలో పారిశుద్ధ్యం, పచ్చదనం గణనీయంగా మెరుగుపడిన తీరును ప్రజలకు వివరించాలి. జాతీయస్థాయిలో సాధించిన అవార్డుల వివరాలను సభా వేదికగా ప్రజలకు తెలియజేయాలి.
- నాడు – నేడు ఫార్మాట్‌లో గ్రామీణ ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధి గురించి, ప్రజా సంక్షేమానికి, ఇప్పటివరకు పంచాయతీరాజ్ ద్వారా గ్రామానికి వస్తున్న నిధుల వివరాలతో ఊరూరా ప్రచారంలో భాగంగా ప్రగతి ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలి.
- ఆ ఊరిలో జరిగిన అభివృద్ధి పనుల వివరాలను తెలియజేస్తూ ఫ్లెక్సీలు పెట్టాలి. ఫొటోలతో బ్రోచర్ల మాదిరిగా తయారుచేసి గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పంచాలి.
- రాష్ట్ర స్థాయిలో రవీంద్రభారతిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో పల్లెప్రగతిపై నిర్వహించే సమావేశం, సంబంధిత మంత్రితో పాటు, ఉన్నతాధికారులు పాల్గొనే పల్లెప్రగతి విజయాలను, జాతీయ స్థాయిలో సాధించిన అవార్డులను ప్రజలకు తెలియజేయాలి.
- గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడటం వల్ల సీజనల్ వ్యాధులు తగ్గిపోయిన తీరును ప్రముఖంగా గ్రామస్తులకు వివరించాలి. గ్రామీణ జీవన ప్రమాణాలు పెరిగిన తీరును సభా వేదికగా ప్రస్తావించాలి.
- ఉత్తమ గ్రామ పంచాయతీల సర్పంచులు, పంచాయతీ కార్మికులు, ఉత్తమ మండలాల ఎంపీపీలకు సన్మానం చేయాలి.

కోవిడ్ సమయంలో సేవలు హర్షణీయం

- దశాబ్ది ఉత్సవాల్లో కలెక్టర్ ప్రశంస
- పలు ఇబ్బందుల మధ్య వేడుకలు



బాలింతకు కేసీఆర్ కిట్‌ను అందజేస్తున్న కలెక్టర్ అనుదీప్



కూలిపోయిన టెంట్

అశ్వారావుపేట: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను బుధవారం అశ్వారావుపేట సీహెచ్‌సీలో నిర్వహించారు. తొలుత ఆస్పత్రికి మంజూరైన డయాలసిస్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ ప్రారంభించారు. స్థానిక పరిశ్రమ కెమిలాయిడ్స్ యాజమాన్యం రూ.18 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. అనంతరం జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ కరోనా సమయంలో జిల్లాలో వైద్య సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమన్నారు. కాగా, అశ్వారావుపేట ఆస్పత్రి అభివృద్ధికి సహకరించిన కలెక్టర్‌కు ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు. ఇదిలాఉండగా ఆస్పత్రిలోని ఐపీ వార్డులో డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభించగా అందులోని రోగులను వెయిటింగ్ రూంలో పాత సమాగ్రి మధ్యకు మార్చారు. ఇది రేకులషెడ్ కావడంతో ఎండకు ఉక్కిరిబిక్కిరయ్యారు. ఆరుబయట ఏర్పాటు చేసిన టెంటు పాతది కావడంతో వేడుకల మధ్యలోనే పడిపోయింది. గాలి బాగా వీయడంతో దుమ్ము వచ్చి ప్లేట్లపై పడింది. వైద్యశాఖలోని ఓ కీలక అధికారి బంధువని చెప్పి ఓ వ్యక్తి చేసిన హడావుడి కారణంగా స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు అసహనానికి గురయ్యారు. కాగా, వేడుకల ముగింపు కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ రవిబాబు ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో నృత్యం చేశారు. వైద్యరంగంలో విశేష సేవలందించిన వారికి సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

గిరిజనోత్సవాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న డేవిడ్‌రాజ్

భద్రాచలంటౌన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 17న ఐటీడీఏ ఆవరణలోని గిరిజనభవన్‌లో జరిగే గిరిజనోత్సవాలను విజయవంతం చేయాలని భద్రాచలం ఐటీడీఏ ఏపీఓ జనరల్, గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్ అన్నారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్‌తో కలిసి గిరిజనోత్సవాల ఏర్పాట్లపై బుధవారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని మండలాలు, గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, జెడ్పీటీసీ సభ్యులకు ఆహ్వాన పత్రాలు అందజేసి ప్రతి ఒక్కరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎంఓ రమణయ్య, డీఎస్‌ఓ ప్రభాకర్‌రావు, ఆదినారాయణ, అలివేలు మంగతాయారు, నరసింహారావు, చంద్రమోహన్, చలపతి పాల్గొన్నారు.

బస్సులో తరలిస్తున్న గంజాయి స్వాధీనం

పాల్వంచ: ఆర్టీసీ బస్సులో ఇద్దరు వ్యక్తులు గంజాయి తరలిస్తుండగా పాల్వంచ ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎక్సైజ్ సీఐ గురునాథ్‌రాథోడ్ కథనం ప్రకారం.. బుధవారం భద్రాచలం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో గంజాయి తరలిస్తున్నట్లు సమాచారం అందటంతో ఎక్సైజ్ సీఐ గురునాథ్‌రాథోడ్ ఆధ్వర్యంలో సిబ్బంది పాల్వంచలో బస్సును ఆపి తనిఖీ చేశారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా ఉన్న మహారాష్ట్ర ఔరంగబాద్ ఇందిరానగర్ గర్కేడాకు చెందిన షేక్ సమీర్, కుల్దాబాద్‌కు చెందిన రితీశ్‌గౌతమ్‌కు చెందిన బ్యాగుల్లో 40 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీరు ఒడిశా మల్కన్‌గిరి నుంచి హైదరాబాద్‌కు గంజాయిని తీసుకెళ్తూ పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

లోతు వాగులో 19కేజీలు..

కొత్తగూడెంరూరల్: కారులో తరలిస్తున్న 19కేజీల గంజాయిని లక్ష్మీదేవిపల్లి మండలం లోతువాగు వద్ద ఎక్సైజ్ సిబ్బంది పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తిరుపతి తెలిపారు.

కత్తితో పొడిచిన వ్యక్తిపై కేసు

ఇల్లెందు: సింగరేణిలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే బి.రవీందర్‌ను అదేశాఖలో పనిచేస్తున్న జి.అచ్చయ్య కత్తితో పొడిచిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.. ఈ నెల 13న రాత్రి ఓ ఫంక్షన్‌లో భోజనం చేసే క్రమంలో రవీందర్, అచ్చయ్య మధ్య ఘర్షణ జరిగింది. అనంతరం సింగరేణి ఆఫీసర్స్‌క్లబ్ వెనుక గల సబ్‌స్టేషన్ వద్ద రవీందర్‌ను అటకాయించిన అచ్చయ్య కత్తితో పొడిచి హతమార్చేందుకు యత్నించాడు. అడ్డు వెళ్లిన కుమారస్వామిపై కూడా దాడి చేసినట్లు రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ టి.కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముగ్గురిపై కేసు

ఇల్లెందు: మండలంలోని బాలాజీనగర్ పంచాయతీ ఆజాద్‌నగర్‌కు చెందిన జక్కుల ఆదిలక్ష్మిని అదే ప్రాంతానికి చెందిన శివకృష్ణ కొంతకాలంగా మద్యం మత్తులో దూషిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ నెల 6వ తేదీన రాత్రి ఇంటి ముందుకు వచ్చి దూషిస్తూ హతమారుస్తామంటూ బెదిరించాడని, శివకృష్ణకు మద్దతుగా శాంతమ్మ, రేణుక జతకలిసి దాడి చేసేందుకు ప్రయత్నించారంటూ జక్కుల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివకృష్ణ, శాంతమ్మ, రేణుకపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ ఘనీ తెలిపారు.

భార్యపై భర్త దాడి : కేసు నమోదు

దమ్మపేట: వేధింపుల కేసు పెట్టిందనే కక్షతో భార్యపై భౌతిక దాడికి పాల్పడిన భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని దమ్మపేట గ్రామం మల్లారంకాలనీకి చెందిన మాధవి నెల రోజుల కిందట భర్త బోయిన జలంధర్, అతడి కుటుంబ సభ్యులపై వేధింపుల కేసు పెట్టింది. భార్య కేసు పెట్టిందనే కక్షతో జలంధర్ ఈ నెల 5వ తేదీన భార్య మాధవిని తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావం జరిగింది. గమనించిన స్థానికులు దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

దమ్మపేట: వృద్ధుడిపై భౌతికదాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని పట్వారిగూడెం గ్రామానికి చెందిన కొప్పుల వంశీ నెల రోజుల కిందట రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన పొదిలి వెంకటేశ్వరరావు ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. ఈ విషయం గ్రామపెద్దలకు చెప్పగా వంశీని పిలిపించి మందలించారు. మందలింపు విషయం మనసులో పెట్టుకున్న వంశీ తండ్రి కొప్పుల వెంకటేశ్వరరావు ఈ నెల 5వ తేదీన రాత్రి 9 గంటలకు పొదిలి వెంకటేశ్వరరావు ఇంట్లోకి ప్రవేశించి అతడి తండ్రి నర్సింహారావుపై భౌతికదాడికి పాల్పడ్డాడు. బాధితుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కొప్పుల వెంకటేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కామేపల్లి(కారేపల్లి): ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి బుధవారం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని బర్లగూడెం గ్రామానికి చెందిన గుగులోత్ బాబు (50) మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 13న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగులమందు తాగగా కటుంబ సభ్యులు ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు.

మట్టి తరలిస్తున్న టిప్పర్ల అడ్డగింత

నేలకొండపల్లి: అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని ఆరోపిస్తూ టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్న ఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చందాపురం రెవెన్యూ పరిధి నుంచి వెంచర్లకు అక్రమంగా అనాసాగారం మీదుగా మట్టిని టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అయితే, ఎలాంటి అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తున్నారని స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు మేళ్లచెరువు అరుణ భర్త, మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు తన అనుచరులతో టిప్పర్లను అడ్డగించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ దారా ప్రసాద్‌తో వెంకటేశ్వరరావు వాగ్వాదానికి దిగారు. అక్రమాన్ని ప్రజాప్రతినిధులు అడ్డుకుంటే అధికారులు సహకరించటం లేదన్నారు. ఆయన ఫిర్యాదుతో స్పందించిన రెవెన్యూ అధికారులు ఓ జేసీబీని సీజ్ చేసి, స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ప్రకృతివనం దగ్ధం



దగ్ధమవుతున్న పల్లె ప్రకృతివనం

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా పల్లె ప్రకృతి వనంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చాలా మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి.

ఆత్మహత్యాయత్నం

కామేపల్లి(కారేపల్లి): మండలంలోని నెమలిపురి గ్రామానికి చెందిన మహిళ భూతగాదాల విషయంలో పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నెమలిపురి గ్రామానికి చెందిన భూక్యా మౌనిక తమకు సంబంధించిన ఆస్తిని వేరొకరు ఆక్రమించుకొని ప్రహరీ నిర్మించుకొన్నారని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినా తమను పట్టించుకోకుండా, ప్రహరీ నిర్మించుకున్న వారికే వత్తాసు పలకటంతో పాటు, తమపై కేసు నమోదు చేశారని మనస్తాపానికి గురైన మౌనిక పురుగులమందు తాగింది. స్థానికులు పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు, అర్ధరాత్రి కొత్తలింగాల క్రాస్‌రోడ్డు వద్ద ధర్నా చేపట్టారు. ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి హామీతో ధర్నాను విరమించి, ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మౌనికను ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న అధికారులు

ఖమ్మంగాంధీచౌక్: తప్పిపోయి తిరుగుతున్న బాలుడిని రక్షించి తిరిగి తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఘటన బుధవారం రాత్రి ఖమ్మం నగరంలో చోటు చేసుకుంది. చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జీవనోపాధి కోసం బిహార్ నుంచి ఖమ్మం వచ్చిన ఓ కుటుంబానికి చెందిన ఆరేళ్ల ఫైజల్ బుధవారం సాయింత్రం నగరంలోని వైరారోడ్ హవేలీ రెస్టారెంట్ పరిసరాల్లో తిరుగుతుండటాన్ని గమనించిన ఒకరు 1098కు ఫోన్ చేశారు. దీంతో చైల్డ్‌లైన్ బృందం బాలుడిని అమ్మహోంలో చేర్చారు. అనంతరం వివరాలు ఆరా తీశారు. సామాజిక మాధ్యమాల్లో బాలుడి ఫొటోతో సమాచారం వైరల్ చేశారు. బైపాస్ రోడ్‌లో ఓ వెల్డింగ్ షాప్‌లు పనిచేస్తున్న తల్లిదండ్రులకు సమాచారం అందింది. తల్లిదండ్రులు నాజ్ పర్వీన్, ఎండీ షహనవాజ్‌తో పాటు కుటుంబీకులు అమ్మ హోంకు చేరుకొని ధ్రువపత్రాలు చూపించారు. సీడబ్ల్యూసీ సమక్షంలో చైల్డ్‌లైన్ బృందం బాలుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ భరతరాణి, భాస్కర్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కటౌట్లు ఖాళీ



ఉదయం ఎన్‌టీఆర్ సర్కిల్ సమీపంలో ఉన్న కటౌట్లు



సాయంత్రం కటౌట్లను తొలగించిన దృశ్యం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా గురువారం ఖమ్మంలో బహిరంగ సభలో పాల్గొనాల్సి ఉండగా చివరి నిమిషంలో రద్దయింది. అయితే, బుధ వారం ఉదయం అమిత్‌షాతోపాటు ఇతర బీజేపీ నేతలతో కూడిన కటౌట్లు భారీగా కనిపించాయి. సాయంత్రానికి ఎక్కడికక్కడ తీసేయడంతో రోడ్లన్నీ ఖాళీగా కనిపించాయి. ఎన్‌టీఆర్ సర్కిల్, ఎస్ఆర్ అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల గోడ పక్కన ఏర్పాటు చేసిన భారీ కటౌట్లను తొలగించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, ఖమ్మం

యువతి ఆత్మహత్య కేసులో ఆరేళ్ల జైలు

ఖమ్మంలీగల్: యువతి ఆత్మహత్యకు కారణమైన కారేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన అంగోతు హనుమాకు ఆరేళ్ల జైలు శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కారేపల్లి మండలం అనంతారం తండా సీతారాంపురం గ్రామానికి చెందిన యువతి ఇల్లెందు డిగ్రీ కళాశాలలో చదవుతోంది. ఆమెకు నిందితుడు మాయమాటలు చెప్పి లోబరుచుకొని మోసం చేయడంతో తట్టుకోలేక 2015 ఆగస్టు 27న కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుని చనిపోయింది. ఆ యువతి తండ్రి కారేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారించిన న్యాయమూర్తి నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. అదనపు ప్రాసిక్యూటర్ బి.కృష్ణమెహన్, లైజన్ ఆఫీసర్ ఎం.వెంకటేశ్వర్లు, కోర్టు కానిస్టేబుల్ తోట వెంకటేశ్వర్లు, హోంగార్డు ఓరుగంటి శ్రీనివాసరావు సహకరించారు.

మరోకేసులో ఆరేళ్ల జైలు..

ఆత్మహత్యకు కారకులైన ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడు గ్రామానికి చెందిన షేక్ ఆషా (25), షేక్ హమిదాబి (50), షేక్ గౌస్ (25)కు ఆరేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ ఖమ్మం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.అమరావతి బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. ఫిర్యాది కూతురు హసీనాకు గోళ్లపాడుకు చెందిన షేక్ యాకుబ్‌తో వివాహం జరిగింది. వారి ఇంటి ఎదురుగా ఉన్న షేక్ ఆషా.. హసీనాను మానసికంగా వేధించేది. యాకూబ్‌కు లేనిపోని మాటలు చెప్పి దంపతుల మధ్య గొడవలు సృష్టించేది. దీంతో హసీనా 2016, జులై 2న ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. నిందితులపై నేరం రుజువు కావడంతో పైవిధంగా తీర్పు చెప్పారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

- 6 నెలల్లో 10th; ఇంటర్; డిగ్రీ; P.G; I.T.I; డిప్లమా B.Tech; D.M.L.T; M.L.T; ANM; GNM; నర్సింగ్ D.ఫార్మసీ; B.ఫార్మసీ B.A.M.S; B.H.M.S పూర్తిచేయండి. ✆ 95504 43817 [B-798938]
- One year 10th,inter,NIOS,TOSS, APOSS, Degree&PG, Year Wise Nagarjuna, SV University guidelines for B.Tech, Detained,Failed Students Cont: NICC KPHB Hyd. Ph: 9515390685, 8179882462 [H-788704]

Services

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-781981]
- బంగారం బ్యాంకులలో, ఇతర సంస్థలలో ఉన్నవి విడిపించి, ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును.స్పాట్‌క్యాష్✆ 8886 177 699 [B-1165668]

LOANS

- సులభంగా లోన్ పొందండి. అతి తక్కువ వడ్డీతో, అన్ని రకాల లోన్స్, ఉద్యోగస్తులు, వ్యాపారులు, వైద్యులు (NRI) సంప్ర॥ JS ఎంటర్‌ప్రైజెస్, ఖమ్మం. భద్రాద్రి కొత్తగూడెం. 8520970781, 7842830781. [M-1221172]

BUSINESS OFFER

- ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్ పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్:9310515624, 8800496710. [DA-37247]

OLDAGE HOME

- TANMAYEE ఓల్డేజ్ హోమ్, విజయవాడ, మీ పెద్దలను ప్రేమాభిమానాలతో చూసుకొనుటకు మా హోమ్‌లో చేర్పించండి. మీరు నిశ్చింతగా ఉండండి. ఫోన్ : 7093911010, 9573000987, 8897730222 [HA-287]

Wanted

- ప్రముఖ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీలో మేనేజర్స్ కావలెను. జీ: 12–30 వేలు, Inter ఆపైన నిరుద్యోగులు, రిటైర్డ్, ప్రైవేట్ ఎంప్లాయిస్, హౌస్‌వైఫ్స్, రియల్ ఎస్టేట్ పోస్టల్, చిట్ ఏజెంట్స్ వారు ఫోన్ చేయండి. 9550851761. [M-1221318]
- కంప్యూటర్ ఆపరేటర్స్ (ఫిమేల్) జీతం 8–10 వేలు, సెక్యూరిటీ గార్డ్స్, డ్రైవర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ఓం శ్రీసాయి బాలాజీ సెక్యూరిటీ సర్వీస్, ఖమ్మం. సంప్ర॥ 90002 12387, 95028 82478. [M-1221179]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా రోజుకు 50 మెసేజ్‌లు పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221315]
- బేబీమూన్ స్కూల్ నందు పనిచేయుటకు వార్డెన్స్ (స్త్రీ / పు), స్వీపర్స్, నైట్ సూపర్‌వైజర్స్ కావలెను. Baby Moon High School, Khammam. 8897666346, 9908699119. [M-1221012]
- షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, భార్యా-భర్తలు, డ్రైవర్స్,సాయి మందిరములో పూజారి కావలెను. ఫోన్ : 9391036931, 9246585901. [HA-11235]
- లేపాక్షి హెల్త్ కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18k. ఏజెంట్ కమీషన్ 6k. ఫోన్: 9640400073 [HA-284]
- ఖమ్మం,భద్రాచలం,మణుగూరు, సత్తుపల్లి బ్రాంచిలలో ప్రముఖ బ్యూటీపార్లర్ నందు పనిచేయుటకు టెలికాలర్స్,రిసెప్షనిస్ట్, క్యాషియర్స్, ఇంచార్జి,మేనేజర్స్,(స్త్రీలు) మాత్రమే కావలెను. జీతం: 18వేలు for month 7993278006 Note: ఎటువంటి ఫీజ్ లేదు. [H-781386]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం : 9010299957, 9705444182
కొత్తగూడెం : 9010223783
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416

క్లుప్తంగా...

జి-20తో బంధం బలోపేతం
యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్



సాక్షి, హైదరాబాద్: జి-20 అగ్రికల్చరల్ వర్కింగ్ గ్రూప్ సమావేశం అమెరికా-భారత్ ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి గొప్ప అవకాశమని యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ అన్నారు. ఈ సంవత్సరం జి-20 అధ్యక్ష స్థానంలో భారత్ నాయకత్వాన్ని ఆమె అభినందించారు. భారత సంస్కృతి, వంటకాలు అంతర్జాతీయంగా పేరే న్నికగన్నాయన్నారు. 'టేస్ట్ ఆఫ్ అమెరికా'ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రాం కింద అమెరికాలోని ప్రీమియం వ్యవసాయ ఉత్పత్తులు, బేవరేజెస్‌ను భారతీయులకు రుచికరంగా అందించడానికి వీలువుతోందని వ్యాఖ్యానించారు. వ్యవసాయ ఉత్పత్తుల్లో ద్వైపాక్షిక వాణిజ్యం పెరగాలని ఆకాంక్షించారు. అమెరికా ఆహార పదార్థాలపై భారత్‌లోని దక్షిణాది ప్రజల్లో ఆసక్తి కల్పించడానికి వీలుగా బుధవారం నాడు ఓ స్టార్ హోటల్‌లో 'హై టీ సెలబ్రేషన్స్'ను నిర్వహించారు. అమెరికా వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన అండర్ సెక్రటరీ గ్జోచిట్ టర్రెస్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టిస్టా ల్యాబ్ సందర్శించిన జర్మనీ బృందం
తెలంగాణ విత్తన ధ్రువీకరణ సంస్థకు చెందిన అంతర్జాతీయ విత్తన ప్రయోగశాల (టిస్టా)ను జర్మనీ వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రతినిధుల బృందం బుధవారం సందర్శించింది. విత్తనాభివృద్ధి సంస్థ అధికారులతో బృందం సమావేశమయ్యింది.

యూఏఈ కాన్సులేట్ జనరల్ కార్యాలయం ప్రారంభం



బంజారాహిల్స్ (హైదరాబాద్): బంజారాహిల్స్ రోడ్ నెం. 12లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాయబార కార్యాలయం బుధవారం ప్రారంభమైంది. యూఏఈ మంత్రి అహ్మద్ అలీ అల్ సయేగ్, రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, హైదరాబాద్‌లో యూఏఈ కాన్సులేట్ జనరల్ ఆర్ఎఫ్ అల్ నునైని తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నేటి నుంచి జీ-20 | వ్యవసాయ మంత్రుల సమావేశం

- 3 రోజులు హైదరాబాద్‌లో నిర్వహణ
- 30 దేశాల వ్యవసాయ మంత్రుల రాక



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్ (ఏడబ్ల్యూజీ) మినిస్టీరియల్ సమావేశాలకు హైదరాబాద్ సిద్ధం అయ్యింది. గురువారం నుంచి ఈ నెల 17 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సుకు జీ20 సభ్య దేశాలు, ఆహ్వానిత దేశాలు, అంతర్జాతీయ సంస్థల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారు. కార్యక్రమంలో వివిధ దేశాల వ్యవసాయ మంత్రులు, అంతర్జాతీయ సంస్థల డైరెక్టర్ జనరల్స్ పాల్గొంటారు. కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కైలాష్ చౌదరి మొదటిరోజు ఎగ్జిబిషన్ ప్రారంభిస్తారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో భారత్ సాధించిన విజయాలను ఇందులో ప్రదర్శిస్తారు. అనంతరం వ్యవసాయ డిప్యూటీస్ మీటింగ్ (ఏడీఎం) జరుగనుంది. ద్వితీయార్థంలో అగ్రిబిజినెస్ ఫర్ ప్రాఫిట్, పీపుల్ అండ్ ప్లానెట్ నిర్వహణ, 'డిజిటల్లీ డిస్కనెక్ట్: వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతను ఉపయోగించుకోవడం' కార్యక్రమాలు జరుగుతాయి. జీ-20 సమావేశంలో పాల్గొనే మంత్రులు, ఇతర ప్రతినిధి బృందాల నాయకులకు కేంద్ర వ్యవసాయ మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్వాగతం పలకడంతో రెండవరోజు సమావేశం ప్రారంభమవుతుంది. ఆహార భద్రత, పౌష్టికాహారం కోసం సుస్థిర వ్యవసాయం, మహిళల నేతృత్వంలోని వ్యవసాయం, సుస్థిర జీవవైవిధ్యం, వాతావరణ సమస్యల పరిష్కారాలపై మంత్రులు, ఉన్నత స్థాయి అధికారుల చర్చలు మూడు సమాంతర సెషన్లలో జరుగుతాయి. మూడవ రోజు భారత్ అధ్యక్షతన అగ్రికల్చర్ వర్కింగ్ గ్రూప్, జీ-20 ఫలితాలను ఆమోదించడంతో మంత్రుల సమావేశం ముగుస్తుంది. అనంతరం హైదరాబాద్‌లోని ఐసీఏఆర్ -ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐఐఎంఆర్)కు సాంకేతిక విజ్ఞాన యాత్రకు ప్రతినిధి బృందం వెళ్తుంది.

నకిలీ విత్తన ముఠా అరెస్ట్

- వాహనాల తనిఖీలో పట్టుబడిన ముగ్గురు నిందితులు, పరారీలో మరొకరు
- రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం
- నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తాం: నల్లగొండ ఎస్పీ



పట్టుబడిన నకిలీ విత్తనాలు, నిందితులతో ఎస్పీ అపూర్వరావు, ఇతర పోలీస్ సిబ్బంది

నార్కట్‌పల్లి: నకిలీ విత్తనాలను సరఫరా చేస్తున్న ఓ ముఠాను నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి రూ.1.80 కోట్ల విలువైన పది టన్నుల పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నల్లగొండ ఎస్పీ అపూర్వరావు వివరాలు వెల్లడించారు. సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్ హిల్స్ ప్రాంతానికి చెందిన గోరంట్ల నాగార్జున, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు జిల్లా పెద్దకూరపాడు గ్రామానికి చెందిన గడ్డం రవీంద్రబాబు, నంద్యాల జిల్లా గోసపాడు మండలం జిల్లెల గ్రామానికి చెందిన మెరిగె వేణు, అన్నమయ్య జిల్లా మదనపల్లి గ్రామానికి చెందిన నర్సింహ ఓ ముఠాగా ఏర్పడి కొన్నేళ్లుగా నకిలీ పత్తి విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఈ ముఠా సభ్యులు కర్ణాటకలో పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేసి గుంటూరు జిల్లా దాచేపల్లి సమీపంలో స్టోరేజీ చేశారు. అక్కడ నుంచి మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన రైతులకు ఎక్కువ ధరకు అమ్మేందుకు హైదరాబాద్ మీదుగా తరలించాలని నిర్ణయించుకున్నారు. కారులో నాగార్జున, రవీంద్రబాబు, వేణు బయలుదేరారు. పక్కా సమాచారంతో బుధవారం తెల్లవారుజామున నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పోలీసులు, టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఓ ఎర్టిగా కారును తనిఖీ చేయగా రెండు బస్తాల విత్తనాలు బయటపడ్డాయి. వాటిని వ్యవసాయ అధికారులు పరిశీలించి నకిలీ విత్తనాలుగా నిర్ధారించారు. దీంతో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించి మిగతా విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు నర్సింహ పరారీలో ఉన్నాడని ఎస్పీ తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ ప్రయోగించనున్నట్టు చెప్పారు.

కొద్దిగంటల్లో పెళ్లి... వడదెబ్బతో వరుడు మృతి



తిరుపతి (ఫైల్)

కౌటాల: ఆనందంగా పెళ్లి జరగాల్సిన ఇంట తీవ్ర విషాదం నెలకొంది. మరి కొద్ది గంటల్లో పెళ్లనగా వరుడు వడదెబ్బతో మృతి చెందాడు. కుమురంభీం జిల్లా కౌటాల మండలం గుడ్లబోరి గ్రామంలో బుధవారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన గుండ్ల శ్యాంరావ్, యశోద దంపతులకు ముగ్గురు కుమారులున్నారు. పెద్ద కుమారుడు గుండ్ల తిరుపతి (32)కి ఇటీవల మంచిర్యాల జిల్లా భీమిని గ్రామానికి చెందిన యువతితో పెళ్లి నిశ్చయమైంది. బుధవారం మధ్యాహ్నం వివాహ ముహూర్తం నిర్ణయించారు. వరుడి ఇంట్లోనే పెళ్లి జరగాల్సి ఉంది. ఈ క్రమంలో పెళ్లి పత్రికల పంపిణీ, పెళ్లి ఏర్పాట్ల పనుల్లో వారం రోజులుగా అతను ఎండల్లో తిరుగుతున్నాడు. దీంతో తిరుపతి మంగళవారం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు మంచిర్యాలకు తరలించారు. చికిత్స పొందుతూ అతను బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పెళ్లి కోసం వేసిన పందిట్లో తిరుపతి మృతదేహంపై పడి కుటుంబ సభ్యులు రోదించిన తీరు అందరినీ కలచివేసింది.



విత్తిన విత్తనాలకు ట్యాంకర్ ద్వారా నీటిని అందిస్తున్న దృశ్యం

ఆశలు మొలకెత్తేనా..

చింతపల్లి: వర్షాలు పడగానే విత్తనాలు మొలకెత్తుతాయని పత్తి విత్తనాలను పొడి దుక్కుల్లో వేసేందుకే రైతులు ఆసక్తి చూపుతుంటారు. ఈ ఏడు కూడా అలాగే విత్తిన రైతులు ఇప్పుడు వర్షాల కోసం నిరీక్షిస్తున్నారు. ఇప్పట్లో వానలు పడేట్లు లేవని మరికొందరు ట్యాంకర్ల ద్వారా నీటిని చిలకరిస్తున్నారు. నల్లగొండ జిల్లాలోని చింతపల్లి మండల కేంద్రానికి చెందిన ఏరుకొండ శివ సైతం.. తనకున్న ఐదు ఎకరాల భూమిలో పత్తి విత్తనాలు వేశాడు. వానల జాడ లేక వాటికి ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నాడు. విత్తనాలు భూమిలో మురిగిపోకుండా, మొలకెత్తాలనే ఆశతో ట్యాంకర్‌తో నీటిని పోస్తున్నట్లు శివ తెలిపాడు.

మండే ఎండలు.. వడగాల్పులు

- రుతుపవనాల రాక ఆలస్యంతో అధిక ఉష్ణోగ్రతలు
- గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు



సాక్షి, హైదరాబాద్: రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఇంకా అధికంగా నమోదవుతున్నాయి. ఈ క్రమంలో పశ్చిమ దిశ నుంచి బలమైన గాలులు వీస్తుండడంతో కొన్ని ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరించింది. ప్రధానంగా అదిలాబాద్, ఖమ్మం, ములుగు, కుమురంభీం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నల్లగొండ, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో వడగాల్పుల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉంది. ఇక గురు, శుక్రవారాల్లో అక్కడక్కడా తేలికపాటి వానలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది. ప్రస్తుతం రాష్ట్రానికి పశ్చిమ దిశ నుంచి తక్కువ ఎత్తులో బలంగా గాలులు వీస్తున్నాయి. బుధవారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత అత్యధికంగా కరీంనగర్ జిల్లా తంగులలో 45.4 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది. బుధవారం రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు పరిశీలిస్తే... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 42.2 డిగ్రీ సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత మెదక్‌లో 25.2 డిగ్రీ సెల్సియస్‌గా నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
తంగుల	కరీంనగర్	45.4
శ్రీరామ్‌పూర్	పెద్దపల్లి	45.1
తక్కళ్లపల్లి	పెద్దపల్లి	44.4
లక్ష్మీదేవిపల్లి	కొత్తగూడెం	44.2
మల్లాపూర్	జగిత్యాల	44.2

రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..(సెల్సియస్‌లలో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
ఆదిలాబాద్	41.8	30.4	ఖమ్మం	42.2	30.0
భద్రాచలం	42.8	28.5	మహబూబ్‌నగర్	38.7	27.0
హకీంపేట్	39.0	26.8	మెదక్	40.6	25.2
దుండిగల్	39.0	26.0	నల్లగొండ	41.0	25.4
హనుమకొండ	40.5	29.5	నిజామాబాద్	40.3	27.4
హైదరాబాద్	39.1	27.0	రామగుండం	41.6	31.5

ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో 'తెలంగాణ టాప్'

సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో తెలంగాణ ముందంజలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కేంద్ర పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ రిఫార్మ్స్ అండ్ పబ్లిక్ గ్రీవెన్స్ (డీఏఆర్‌పీజీ) ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరుపై నెలవారీ నివేదికను బుధవారం విడుదల చేసింది. తెలంగాణ ప్రభుత్వం సగటున ఒక్కో ఫిర్యాదు పరిష్కారానికి కేవలం 8 రోజుల సమయం మాత్రమే తీసుకుందని ప్రకటించింది. కాగా మొత్తం నాలుగు కేటగిరీల్లో రాష్ట్రాలను విభజించి ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో రాష్ట్రాల పనితీరు ఆధారంగా కేంద్ర ప్రభుత్వం ర్యాంకింగ్స్ ఇచ్చింది. 72.49 శాతం ఫిర్యాదుల పరిష్కారంతో 15 వేల కంటే తక్కువ ఫిర్యాదుల కేటగిరీలో తెలంగాణ మొదటి స్థానంలో నిలిచింది. ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి మే 31 వరకు తెలంగాణలో 2,633 ఫిర్యాదులు అందాయి. దేశంలోనే అతి తక్కువ సమయంలో 2,524 ఫిర్యాదులను పరిష్కరించిన తెలంగాణ రాష్ట్రం, పరిష్కార కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచిందని నివేదికలో వెల్లడించింది. అంతేగాక 15 వేల కంటే ఎక్కువ ఫిర్యాదుల కేటగిరీలో ఉత్తరప్రదేశ్ 1,16,840 ఫిర్యాదుల్లో 62.07 శాతం పరిష్కరించి ఆ కేటగిరీలో మొదటి స్థానంలో నిలిచింది.

జిల్లా వార్తలు


రక్తదాతకు గవర్నర్ పురస్కారం



గవర్నర్ నుంచి పురస్కారం అందుకుంటున్న మురళి

భద్రాచలంఅర్బన్: 50 సార్లకు పైగా రకదానం చేసి పలువురిని అపత్కర పరిస్థితుల్లో ఆదుకున్న భద్రాచలానికి చెందిన కొప్పుల మురళి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా విశిష్ట పురస్కారం అందుకున్నాడు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్ భవన్‌లో ప్రపంచ రక్తదాన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఎందరికో రక్తదానం చేసిన మురళిని గవర్నర్ అభినందించారు.

పేదల గుడిసెలపై ప్రతాపమా..?



మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

అశ్వారావుపేట: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిన ప్రభుత్వాలు వారి గుడిసెలు తొలగించేందుకు అరాచకాలు చేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వీరయ్య మండిపడ్డారు. బుధవారం అశ్వారావుపేటలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రారంభమైన మూడురోజుల రాజకీయ శిక్షణ తరగతుల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. 58 జీఓ ప్రకారం స్వాధీనంలో ఉన్న భూములకు పట్టాలిస్తానన్న ముఖ్యమంత్రి అదే జీఓతో ధనవంతులకే మేలు చేస్తున్నారన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు సాధించేందుకు ఈనెల 19 నుంచి 21 వరకు తహసీల్దార్లకు నేరుగా దరఖాస్తులు అందజేయడం, 18 నుంచి 21 వరకు బస్సుయాత్ర ద్వారా పేదలను సమీకరించి ఉద్యమం చేపడతామని తెలిపారు. జూలై 3న కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసాని ఐలయ్య, మాదినేని రమేష్, వి.వెంకటేశ్వర్లు, కందాల ప్రమీల, బొంతు రాంబాబు, డి.బాల్‌రెడ్డి, ఎం .శ్రీనివాస్, బాలరాజుగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొక్కెరపాటి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటాడుకుందామా..!

- పాఠశాలల క్రీడలకు మార్గం సుగమం
- పట్టణ, మండల, జోన్, జిల్లాస్థాయిలో టోర్నీలు
- సెప్టెంబర్‌లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల నిర్వహణకు నిర్ణయం
- ఈసారి ఎస్‌జీఎఫ్, శాట్స్ సంయుక్త ఆధ్వర్యంలో క్రీడా పోటీలు





పరుగు పందెంలో పాల్గొన్న అథ్లెట్లు (ఇన్‌సెట్) బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారుడు

ఖమ్మం స్పోర్ట్స్: ఏటా రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడలు ఎంతో ఉత్సాహంగా కొనసాగేవి. కానీ గత మూడేళ్లుగా కరోనా నేపథ్యాన జాతీయ, రాష్ట్రస్థాయి పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మంగళం పాడేసింది. అయితే, పరిస్థితులు చక్కబడిన నేపథ్యాన మళ్లీ ఈ ఏడాది నుంచి రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎజీఎఫ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ(శాట్స్) సంయుక్త ఆధ్వర్యంలో మండల స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు పోటీలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించింది. ఇటీవల సంయుక్తంగా జరిగిన సమావేశంలో క్యాలెండర్ సైతం విడుదల చేశారు.

ఆగస్టులో ఆరంభం

జాతీయస్థాయి పోటీలకు అనుగుణంగా ముందస్తుగానే రాష్ట్ర జట్లను ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆగస్టు మొదటి, రెండో వారాల్లో పట్టణస్థాయిలో పూర్తి చేసుకుని జోనల్‌స్థాయి(నిర్ణయించిన మండలాలు) క్రీడలను ఆగస్టు మూడో వారంలో జరిపేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాస్థాయి పోటీలను సెప్టెంబర్ రెండో వారంలో జరపాలని నిశ్చయించుకున్నారు. అదే విధంగా రాష్ట్రస్థాయి పాఠశాలల క్రీడలను హైదరాబాద్‌లో జరపాలనే నిర్ణయం జరిగింది. దీనికి సంబంధించిన ప్రణాళికలను ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారికి పంపినట్లు సమాచారం.

'శాట్స్'ను కూడా కలుపుకుని...

ఇంత వరకు ఈ పోటీలను కేవలం రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మాత్రమే నిర్వహించేది. కానీ రాష్ట్ర ప్రభుత్వం శాట్స్‌ను కూడా బాధ్యులను చేయడంతో ఆంతర్యమేమిటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. 2000 సంవత్సరంలో కంబైన్డ్ క్రీడల పేరిట స్కూల్ గేమ్స్, అప్పటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ జరిపాయి. కానీ రెండింటి మధ్య పొసగకపోవడంతో మళ్లీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, స్పోర్ట్స్ అథారిటీలు వేర్వేరుగానే పోటీలు జరిపాయి. గతంలో స్పోర్ట్స్ అథారిటీలకు గ్రామీణ క్రీడోత్సవాలు, మహిళ క్రీడోత్సవాలు ఏటా జరుగుతుండేవి. కేంద్ర ప్రభుత్వం 2004 నుంచి క్రీడా పాలసీలను మార్చడంతో పై క్రీడోత్సవాలకు జాతీయ స్థాయిలోనే మంగళం పాడారు. దీంతో పంచాయతీ యువ క్రీడా ఖేల్ అభియాన్(పైకా), రాజీవ్ క్రీడా ఖేల్ అభియాన్ క్రీడలను జరిపారు. 2014 నుంచి మొత్తంగా పై రెండు క్రీడలను కేంద్ర ప్రభుత్వం ఎత్తివేసి ఖేలో ఇండియా పేరుతో జాతీయస్థాయిలో రాణించిన క్రీడాకారులకు మాత్రమే నిర్వహిస్తోంది. గత కొంత కాలంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో నెలకొన్న అనిశ్చితి కారణంగా రెండేళ్ల నుంచి వివిధ స్థాయిల్లో క్రీడా పోటీలు జరుగుతున్న స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడలను నిర్వహించడం లేదు. ఈసారి నుంచి పాఠశాలల క్రీడలు జరిగే అవకాశం ఉండటంలో పాఠశాలల క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు నూతనోత్సాహంతో ఉన్నారు.

అండర్-19 క్రీడలపై అయోమయం

జూనియర్ కళాశాలల్లో చదివే క్రీడాకారులను మాత్రమే అండర్-19 విభాగంలో దాదాపు 30 క్రీడాంశాలకు పైగా పాల్గొనే ఆవకాశం ఉంది. అయితే రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఫిజికల్ డైరెక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. కనీసం క్రీడా జట్ల ఎంపికలను చేయలేని దుస్థితి జిల్లాలో ఉంది. వరంగల్ రీజియన్‌లో ఇద్దరు ఫిజికల్ డైరెక్టర్లు మాత్రమే ఉన్నారు. అయితే స్కూల్ గేమ్స్ నిర్వాహకులను ప్రతిసారి బతిమిలాడి క్రీడా జట్లను అయా జిల్లాల్లో ఎంపిక చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఒకే ఒక ఫిజికల్ డైరెక్టర్ మాత్రమే ఉన్నారు. అయితే గతంలో జిల్లాస్థాయిలో నిర్వహించడంతో ఈసారి తాను చేయలేనని చేతులేత్తేసినట్లు తెలిసింది. ఉత్సాహవంతులైన క్రీడాకారులు ఉన్న వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేయలేక పోయినా కనీసం ఎలిజిబులిటి ఫారాలు నింపే వారు కరువవడం శోచనీయం.

పాత బకాయిలకు మంగళం

రాష్ట్రంలోని గతంలో నిర్వహించిన పాఠశాలల క్రీడలను రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిల్లా క్రీడల కార్యదర్శులకు పాత బకాయిలు చెల్లించే విషయంలో ఇప్పటి వరకు ఏలాంటి హామీ ఇవ్వకపోగా బిల్లులు సమర్పించిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిధులను మంజూరు చేయలేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈసారి నేరుగా రాష్ట్రస్థాయి పోటీలను హైదరాబాద్‌లో జరపడం వెనుక ఆంతర్యమేంటని వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా గతంలో నిర్వహించిన క్రీడల కార్యదర్శులకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే గతంలో మాదిరిగా స్కూల్ గేమ్స్ ఫేడరేషన్‌కు ప్రతి ఏటా రూ.3 కోట్లకు పైగా నిధులు విడుదల చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర, జాతీయ పోటీల వరకు ఖర్చు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించేది. గత కొంతకాలంగా పై విధానానికి స్వస్తి పలికి జిల్లా కార్యదర్శులు మాత్రమే అన్ని ఖర్చులు పెట్టుకుని తర్వాత బిల్లు సమర్పించాలని చెప్పడంతో అదే విధంగా చేస్తున్నారు. ఇన్ని వ్యయప్రయాసలకోర్చి ఖర్చులు పెట్టినా బిల్లు ఇవ్వడంలో రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్లక్ష్యం వహిస్తుందనే ఆరోపణలు ఉన్నాయి.

విధుల్లోకి మార్కెట్ ఉద్యోగులు

ఖమ్మంవ్యవసాయం: పదోన్నతి పొందిన వ్యవసాయ మార్కెట్ కమిటీల ఉద్యోగులు బుధవారం విధుల్లో చేరారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 మంది సహాయ కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా రాష్ట్ర మార్కెటింగ్ శాఖ పదోన్నతులు కల్పించింది. ఈ ప్రక్రియలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నలుగురు సహాయ కార్యదర్శులకు గ్రేడ్-3 కార్యదర్శులుగా పదోన్నతులు లభించిన విషయం తెలిసిందే. ఆ ఉద్యోగులు ప్రస్తుతం పనిచేస్తున్న స్థానాల్లో విధుల నుంచి విడుదలై కేటాయించిన స్థానాల్లో బాధ్యతలు చేపట్టారు.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శులుగా పనిచేస్తున్న డి.నిర్మల గ్రేడ్-3 కార్యదర్శిగా పదోన్నతి పొంది భద్రాకొత్తగూడెం జిల్లా బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం బాధ్యతలు చేపట్టారు. మరో సహాయ కార్యదర్శి ఎస్. రాజేంద్రప్రసాద్ మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. వైరా వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న వి.నాగేశ్వరి నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గ్రేడ్-3 కార్యదర్శిగా, కల్లూరు వ్యవసాయ మార్కెట్‌లో సహాయ కార్యదర్శిగా పనిచేస్తున్న తాడేపల్లి కిరణ్ గ్రేడ్-3 కార్యదర్శిగా భద్రాద్రికొత్తగూడెం జిల్లా దమ్మపేట వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం విధుల్లో చేరారు.


రాజధానికి 'ఉత్తమ' సర్పంచ్‌లు

నేడు హైదరాబాద్‌లో పల్లె ప్రగతి సభ

నేలకొండపల్లి/చుంచుపల్లి : రాష్ట్ర ఆవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రభుత్వం గురువారం పల్లె ప్రగతి కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలో వివిధ విభాగాల్లో ప్రతిభ చూపిన పంచాయతీలను ఎంపిక చేశారు. ఆయా సర్పంచ్‌లను ఆహ్వానించడంతో పాటు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు. ఖమ్మం జిల్లా నుంచి ఇద్దరు, భద్రాద్రి జిల్లా నుంచి ఇద్దరు మల్టీపర్పస్ వర్కర్లను సైతం ఆహ్వానించారు. వారిని సన్మానించి, పురస్కారం అందించనున్నారు. ఎంపికైన వాటిలో ఖమ్మం జిల్లాకు చెందిన చింతకాని మండలం తిమ్మినేనిపాలెం, చిన్నమండవ, వందనం, నాగిలిగొండ, చింతకాని, లచ్చగూడెం, బోనకల్ మండలం చిరునోముల, బోనకల్, నేలకొండపల్లి మండలం మోటాపురం, కూసుమంచి మండల కేంద్ర పంచాయతీ, కొణిజర్ల మండలం పెద్దగోపతి, మధిర మండలం నాగవరప్పుపాడు, మోటమర్రి, వేంసూరు మండలం బైరవునిపాడు, ముదిగొండ మండలం పమ్మి, మేడేపల్లి, సత్తుపల్లి మండలం కిష్టారం, కొత్తూరు, కాకర్లపల్లి, తల్లాడ మండల కేంద్రంతో పాటు కుర్నవల్లి, కల్లూరు మండల కేంద్రం , తిరుమలాయపాలెం మండల కేంద్రం, రఘునాథపాలెం మండలం రేగులచెలక, ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు, ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు పంచాయతీలు ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలోని గౌతంపూర్, జమేదార్ బంజర, సుజాతనగర్, మోరంపల్లి బంజర, బోడు, కాకర్ల, ఉప్పుసాక, తొట్టిపంపు, కోయగూడెం, అకినేపల్లి, అంబేడ్కర్‌నగర్, చల్ల సముద్రం, అశ్వారావుపేట, వేపలగడ్డ, చింతోనిచెలక, చింతగుప్ప గ్రామాల సర్పంచ్‌లు ఉన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తికే ప్రాధాన్యం..

సింగరేణి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ ఉమేశ్ మధూకర్‌రావు



రక్షణ చర్యలపై సూచనలిస్తున్న ఉమేశ్‌మధూకర్‌రావు

సత్తుపల్లిరూరల్: సింగరేణి ఓపెన్‌కాస్ట్ పని ప్రదేశాల్లో రక్షణతో కూడిన ఉత్పత్తికే ప్రాధాన్యమివ్వాలని సింగరేణి డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (మైనింగ్) ఉమేశ్‌మధూకర్‌రావు ఆదేశించారు. బుధవారం కొత్తగూడెం ఏరియాలోని సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీల్లో సావర్కర్, డీడీఎంఎస్ (మైనింగ్) కమలేశ్‌కుమార్‌వర్మతో కలిసి ఆయన పర్యటించారు. కొత్తగూడెం ఏరియా జీఎం జక్కం రమేశ్ స్వాగతం పలికారు. జేవీఆర్, కిష్టారం ఉపరితల గనుల్లో వ్యూ పాయింట్ ద్వారా బొగ్గు ఉత్పత్తి, ఓబీ తొలగింపు, బొగ్గు రవాణాను పరిశీలించారు. రక్షణపై తీసుకుంటున్న చర్యలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉంటూ పూర్తి రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తి చేయాలని, కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు ఎప్పటికప్పుడు పని ప్రదేశాలను పరిశీలించాలని సూచించారు. అనంతరం 150 మంది కాంట్రాక్ట్ కార్మికులతో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో జీఎంలు గురవయ్య, కుమారస్వామి, జీవీ కోటిరెడ్డి, ఓసీల పీఓలు వెంకటాచారి, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ అవార్డుల ప్రదానం



ఉద్యోగులను సత్కరిస్తున్న దృశ్యం

బూర్గంపాడు: ఐటీసీ అనుబంధ సంస్థ, రోటరీక్లబ్ ఆఫ్ ఇన్‌భద్రా ఆధ్వర్యంలో బుధవారం సారపాక ఐటీసీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో ఒకేషనల్ అవార్డుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రోటరీ ఇన్‌భద్రా ప్రెసిడెంట్ భాస్కర్ మాట్లాడుతూ.. ఐటీసీలో వివిధ డిపార్ట్‌మెంట్లకు చెందిన 11 మంది సర్వీస్ ప్రొవైడర్ ఉద్యోగులకు అవార్డులు అందించామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్, జేకే దాస్, ఏవీఎస్ గోవిందరావు, మరదాన శ్రీనివాస్, చాంద్ బాషా, రవికుమార్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, షేక్ బాషా, యువీ రావు, వై.సుధాకర్‌రెడ్డి, బి.శ్రీకాంత్‌రెడ్డి, ప్రసాద్, మురళి, యేసోబు, మహేశ్‌రెడ్డి, సత్యనారాయణ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.